సాక్షి
మంచిర్యాల
సోమవారం, 6, జనవరి, 2025



సరదా.. సరదాగా..! 8లో▸

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో రెండో విడత బర్డ్‌వాక్ సరదా సరదాగా సాగింది. నిర్మల్, కరీంనగర్, వరంగల్ ప్రాంతాల నుంచి పక్షి ప్రేమికులు హాజరయ్యారు.



సింగరేణి సొత్తుకు భద్రతేది?

సింగరేణి సంస్థ మందమర్రి ఏరియాలో దొంగలు స్వైర విహారం చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది పట్టుకోలేక పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.5 /16.3

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చల్లగాలులు వీస్తాయి. రాత్రి మంచు కురుస్తుంది. చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రీడల్లో రాణించాలి

- జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్



బహుమతులు అందిస్తున్న జడ్జి ముఖేష్

బెల్లంపల్లిరూరల్: క్రీడల్లో ప్రతి ఒక్కరూ రాణించాలని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి జె.ముఖేష్ అన్నారు. ఏఎంసీ క్రీడా మైదానంలో బెల్లంపల్లి సబ్ డివిజనల్ పోలీస్, బెల్లంపల్లి జ్యూడీషియల్ టీంలకు నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను జడ్జి ప్రారంభించారు. జ్యూడీషియల్ టీంకు కెప్టెన్‌గా జడ్జి, పోలీస్ టీంకు కెప్టెన్‌గా ఏసీపీ రవికుమార్ వ్యవహరించారు. ఈ పోటీల్లో జ్యూడీషియల్ టీంపై పోలీస్ టీం విజయం సాధించింది. విజేతలకు జడ్జి ముఖేష్, ఏసీపీ రవికుమార్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, స్నేహభావం పెరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటినీ సమానంగా స్వీకరించాలని సూచించారు. ఉద్యోగంతోపాటు క్రీడలతో రాణించి మంచి పేరు పొందాలన్నారు. పోటీల్లో బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో, బెల్లంపల్లిరూరల్, తాండూర్ సీఐలు దేవయ్య, అఫ్జలొద్దీన్, కుమారస్వామి, ఎస్సైలు, పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం:

బెల్లంపల్లిరూరల్: క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. కాల్‌టెక్స్ ఏరియాలో ఏర్పాటు చేసిన మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీలో మొదటి బ్యాచ్‌ను ఏసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడల్లో ఉన్నతంగా రాణించాలన్నారు. అకాడమీలో మెలకువలతో శిక్షణ పొంది జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమంగా రాణించి మంచి పేరు తీసుకురావాలన్నారు. స్థానికంగా క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. అకాడమీకి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి, శ్రీధర్, లయన్స్ క్లబ్ సభ్యుడు రాజమల్లు, అకాడమీ కోఆర్డినేటర్ అల్లం వెంకటేశ్వర్లు, స్థానికులు రాజేశ్, నర్సింగ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

అతిపెద్ద ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూ

- జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్..

దండేపల్లి: రాష్ట్రంలోనే అతిపెద్ద ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూ టీఎస్ అని సంఘం జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్ తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను దండేపల్లి ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ టీఎస్ నిరంతరం కృషిచేస్తుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 50 శాతం ఫిట్మెంట్‌తో మంచి పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను జీపీఎఫ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, గౌరవ అధ్యక్షుడు జనార్దన్, దండేపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు రవి, మల్లేశ్, రాష్ట్ర నాయకులు మనోహర్, వరలక్ష్మి, రమేశ్, తిరుపతి, నరేందర్, గంగన్న, శ్రీనివాస్, ప్రభాకర్, వినోద్, కిషన్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్.. నిర్వహణ నిల్!

పట్టణ ప్రజలు ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణంలో వ్యాయామం చేసుకునేలా గత ప్రభుత్వం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. ఉద్దేశం మంచిదే అయినా.. వాటి నిర్వహణ బాధ్యతను ఎవరూ తీసుకోలేదు. దీంతో ఏడాది తిరగకుండానే చాలా వరకు మరమ్మతులకు వచ్చాయి. కొన్ని పరికరాలు చోరీ అయ్యాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం గాడితప్పింది. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో ఓపెన్ జిమ్‌ల పరిస్థితిపై 'సాక్షి' ఆదివారం చేపట్టిన విజిట్‌లో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి.

- భద్రత కల్పించని మున్సిపల్ అధికారులు
- చోరీ అవుతున్న వ్యాయామ పరికరాలు
- వృథాగా మారుతున్న లక్షల నిధులు



ఎలాంటి రక్షణ లేకుండా రాముని చెరువు చిల్డ్రన్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

సాక్షి విజిట్

పట్టింపు శూన్యం..



తిలక్ స్టేడియంలో ఓపెన్ జిమ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌లపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం చేసిన జిమ్‌లలో ప్రస్తుతం కొన్ని మాత్రమే సరిగా ఉన్నాయి. ఏఎంసీ ఏరియా నంబర్–2 క్రీడా మైదానం, తిలక్‌స్టేడియంలో ఉన్న ఓపెన్‌జిమ్‌లకు రోజూ ఉదయం ,సాయంత్రం వేళల్లో క్రీడాకారులు, వాకర్స్, యువకులు కసరత్తు చేస్తున్నారు. పోచమ్మ చెరువు, అంబేద్కర్‌నగర్, రైల్వే స్టేషన్ ఏరియా (పెద్దనపల్లి బస్తీ) ప్రాంతాల్లోని జిమ్‌లను సరిగా వినియోగించుకోలేకపోతున్నారు. కొన్నిచోట్ల ఓపెన్‌జిమ్‌లు చీకటిపడగానే మందుబాబులకు అడ్డాగామారుతున్నాయి. ఏయే ప్రాంతాల్లో ఏవి అవసరమో గుర్తించకుండా అప్పటి పాలకులు ఏర్పాటు చేయడంతో చాలావరకు నిరుపయోగంగా ఉంటున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్వహణను గాలికి వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏటా మరమ్మతులు చేయించాలి..



ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేయడం బాగానే ఉన్నా పర్యవేక్షణ మాత్రం కరువైంది. మున్సిపల్ అధికారులు ఒక్కసారి కూడా చూడటం లేదు. వాటి నిర్వహణ, పని తీరును పరిశీలించడం లేదు. పాడైపోతున్న పరికరాలను సరి చేయించడం లేదు. విరిగిపోతున్న జిమ్ పరికరాల స్థానంలో కొత్తవి బిగించడానికి చర్యలు తీసుకోవడం లేదు. ఓపెన్ జిమ్‌లను వెంటనే పరిశీలించి అవసరమైనవాటికి మరమ్మతులు చేయించాలి.

– రత్నం ఐలయ్య, సీనియర్ వాకర్, బెల్లంపల్లి

పరికరాలు చోరీ...

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలో లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన జిమ్‌లోని పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో ఆ భారం మున్సిపాలిటీపై పడుతోంది. చెడిపోయిన పరికరాలకు మరమ్మతులు చేయించడం, చోరీ అయినవాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం మున్సిపాలిటీకి భారంగా మారింది. మంచిర్యాల మున్సిపాలిటీలో 10 ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. హైటెక్‌సిటీ కాలనీ పార్కు ఓపెన్ జిమ్, పాతమంచిర్యాల పార్కు, రెడ్డి కాలనీలోని చిల్డ్రన్స్ పార్కు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లలోని పరికరాలు తరుచూ చోరీ అవుతున్నాయి. కొన్ని పరికరాలు పాడవుతున్నాయి. ఒక్కో ఓపెన్ జిమ్‌ను రూ.10 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు ఖర్చు చేసి ఏర్పాటు చేశారు. వాటికి కనీస రక్షణను కల్పించక పోవడంతో ఇప్పటికే పరికరాల్లోని భాగాలు పలుమార్లు చోరీ అయ్యాయి. హైటెక్‌సిటీలోని ఓపెన్‌జిమ్ పార్కు లోపల ఉండడం, పార్కుకు చుట్టూ ప్రహరీ, గేటు ఉండడం, చుట్టూ ఇళ్లు ఉండడంతో సురక్షితంగా ఉన్నాయి. రాముని చెరువు చిల్డ్రన్స్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో పరికరాలు చోరీ అవుతున్నాయి. దీంతో అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, లైట్లు పెట్టారు. అయినా చోరీ ఆగడం లేదు. పోచమ్మ చెరువు కట్ట మీద ఉన్న ఓపెన్ జిమ్ పరికరాలు సైతం చోరీ అవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని ఓపెన్ జిమ్ పరికరాలకు రక్షణ ఉండగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, గర్మిళ్ల పార్కు, రెడ్డి కాలనీ పార్కు, రాంనగర్ పార్కుల్లో రక్షణ లేకపోవడంతో పరికరాలు చోరీ అవుతున్నాయి.

రక్షణ కల్పించాలి..



ప్రశాంత వాతావరణంలో జిమ్ చేసేందుకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌కు ప్రతిరోజు వస్తుంటాను. ఈ జిమ్‌లోని పరికరాలను విరగ్గొట్టడం, దొంగిలించడం చేస్తున్నారు. వ్యాయామం చేసేందుకు వచ్చే వారికి కొన్ని పరికరాలు అందుబాటులో ఉండడం లేదు. పరికరాలను విరగ్గొట్టకుండా, దొంగతనం చేయకుండా రక్షణ కల్పించాలి.

– ఎల్.అనిల్, డిగ్రీ విద్యార్థి, మంచిర్యాల

భద్రత కల్పిస్తాం



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు విరగ్గొట్టిన వాటికి మరమ్మతులు చేస్తున్నాం. చోరీ అయినవాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. ఓపెన్ జిమ్‌లను పార్కుల్లో ఏర్పాటు చేయడం వలన భద్రత కొంత ఇబ్బందిగా ఉంది. అయినా ప్రజల సౌకర్యార్థం ఓపెన్ జిమ్‌లకు భద్రతను కల్పిస్తాం.

– మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

నిత్యం కసరత్తు..



చెన్నూర్ ఉన్నత పాఠశాల మైదానంలో..

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు క్రీడాకారులు, యువకులకు ఉపయోగపడుతున్నాయి. క్రీడాకారులు, యువకులు జిమ్‌లలో కసరత్తు చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు. చెన్నూర్ మున్సిపాలిటీలో ఒక్కోటి రూ.20 లక్షలు వెచ్చించి రెండు ఓపెన్ జిమ్‌లు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఒకటి, పాత కూరగాయల మార్కెట్‌లో మరొకటి ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడలు సాధన చేసే క్రీడాకారులతోపాటు పోలీసులు, ఎక్సైజ్, ఎస్సై, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లలో ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువకులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఓపెన్ జిమ్‌లను అధికారులు పరిశీలించక పోవడంతో కొన్ని మొరాయిస్తున్నాయని క్రీడాకారులు, యువకులు పేర్కొంటున్నారు. మున్సిపల్ సిబ్బంది నెలకోసారి పరిశీలించి మరమ్మతుకు వచ్చేవాటిని పనిచేసేలా చూడాలి.

అందరికీ ఉపయోగపడుతుంది..



పాఠశాల మైదానంలో విద్యార్థులు, క్రీడాకారులు సాధన చేసిన తర్వాత ఎక్కడికీ వెళ్లకుండా ఇక్కడే జిమ్ చేసే సౌకర్యం ఉంది. అందరికీ ఓపెన్ జిమ్ ఉపయోగపడుతుంది. కొన్ని పరికరాల నట్లు లూజ్ కావడంతో చేసేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

– అద్వైత్‌దత్తా, విద్యార్థి

అందరికీ అందుబాటులో..



ప్రజలకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో రూ.40 లక్షల నిధులతో రెండు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశాం. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాత కూరగాయల మార్కెట్‌లో రెండు జిమ్‌లు ఏర్పాటు చేశాం. యువకులు, క్రీడాకారులు ఇబ్బంది లేకుండా కసరత్తు చేసుకుంటున్నారు. ప్రతీనెల పరిశీలించి మరమ్మతులు చేయిస్తున్నాం.

– అర్చనరాంలాల్‌గిల్డా, మున్సిపల్ చైర్ పర్సన్ చెన్నూర్

పనిచేయని పరికరాలు..



ఆర్‌కేపీ ఠాగూర్‌స్టేడియంలోని ఓపెన్ జిమ్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులుండగా ఇప్పటివరకు 17 ఓపెన్ జిమ్‌లు ఏర్పాటుచేశారు. మరికొన్ని వార్డుల్లో స్థలాలు అందుబాటులో లేక జిమ్‌లు ఏర్పాటుచేయలేదు. సుమారు రూ.కోటి 50 లక్షలతో ఈ పదిహేడు జిమ్‌లను ఏర్పాటుచేశారు. ఓపెన్‌జిమ్‌ల నిర్వహణ బాగానే ఉన్నప్పటికీ పలుచోట్ల వ్యాయామ పరికరాలు పనిచేయటం లేదు. స్థానిక ఠాగూర్ స్టేడియం, టోని ఫంక్షన్ హాల్, బీజోన్ ఏరియాలో ఏర్పాటుచేసిన జిమ్‌లలో కొన్ని వ్యాయామ వస్తువులు దెబ్బతిన్నాయి. దీంతో వ్యాయామం కోసం వచ్చినవారు అసౌకర్యానికి గురవుతున్నారు. జిమ్‌లను ఏర్పాటుచేసిన కాంట్రాక్టర్‌తోనే పరికరాల మరమ్మతులు చేయిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రాజు, ఏఈ అచ్యుత్ పేర్కొన్నారు.

ఏడు చోట్ల తీర్మానం.. ఏర్పాటు నాలుగే..



న్యూ నాగార్జునకాలనీలోని ఓపెన్ జిమ్

నస్పూర్: పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలలో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు నిర్ణయించింది. పట్టణ పరిధిలోని 7, 9, 11, 17, 21, 22 వార్డులలో ఒక్కో దానికి రూ.20 లక్షల నిధులతో ఏర్పాటుకు, 13వ వార్డులో రూ.50 లక్షలతో ఓపెన్ జిమ్‌తోపాటు చిల్డ్రన్ పార్కు ఏర్పాటుకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. 9, 13, 17, 23 వార్డులలో మాత్రమే అందుబాటులోకి తీసుకువచ్చారు. 13వ వార్డులో కేవలం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి చిల్డ్రన్ పార్కు పనులు ప్రారంభించలేదు. 7, 11, 21, 22 వార్డులలో నేటికీ పనులు మొదలు పెట్టలేదు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చేసిన తీర్మానం మేరకు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి.

శిథిలావస్థకు పరికరాలు



కూర్చునే ప్రదేశంలో విరిగిన సైక్లింగ్

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో ఒక ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసింది. జిమ్‌లోని పరికరాలు విరిగిపోతున్నాయి. సైక్లింగ్ పరికరం కూర్చునే ప్రదేశంలో విరిగిపోయింది. కొన్నిపరకరాలకు కాళ్లతో తొక్కడానికి వీలు లేకుండా ఉన్నాయి. అధికారులు పట్టించుకుని మరమ్మతులు చేయించాలని పట్టణవాసులు కోరుతున్నారు. చెడిపోయిన పరికరాలకు మరమ్మతు చేయిస్తామని కమిషనర్ కల్లెడ రాజశేఖర్ తెలిపారు.

వినియోగంలో ఓపెన్ జిమ్‌లు...



సింగరేణిహైస్కూల్ మైదానంలో..

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు వినియోగంలో ఉన్నాయి. ఊరు మందమర్రి, ఊరచెరువు, సింగరేణి హైస్కూల్ మైదానం, దీపక్‌నగర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల తదితర ఏరియాల్లోని 12 చోట్ల ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. రూ.5 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు చేశారు. కొన్నిచోట్ల మరమ్మతుకు వచ్చాయి. చాలాచోట్ల సవ్యంగానే పనిచేస్తున్నాయి. మరమ్మతులకు వచ్చినవాటిని వెంటనే రిపేర్ చేయిస్తున్నామని మున్సిపల్ ఇంజినీర్ అచ్యుత్ తెలిపారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు..

- కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు..
- గూడెం 'ఎత్తిపోతలు' మరూ..



పూజలు చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం ద్వారా కడెం డిస్ట్రిబ్యూటరీ 30 నుంచి 42 వరకు యాసంగి పంటలకు సాగునీరందిస్తామని కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు తెలిపారు. గూడెం ఎత్తిపోతల పథకం నీటి విడుదలలో భాగంగా ఆదివారం తానిమడుగు సమీపంలోని ఎత్తిపోతల డెలివరీ పాయింట్ వద్ద పూజ కార్యక్రమాల్లో కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, షెడ్యూల్ ప్రకారం నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కడెం ప్రాజెక్టు నీటిని డిస్ట్రిబ్యూటరీ 1 నుంచి 28 వరకు, గూడెం ఎత్తిపోతల నీటిని డిస్ట్రిబ్యూటరీ 30 నుంచి ఆయకట్టు చివరి ప్రాంతమైన హాజీపూర్ మండలంలోని డిస్ట్రిబ్యూటరీ 42 వరకు అందించడం జరుగుతుందన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సాగునీటి సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సీఈ నారాయణ, ఎస్ఈ రవీందర్, డీఈఈలు దశరథ్, వెంకటేశం, ఏఈఈలు రాజేందర్, జాకీర్, కీర్తి, సంజీవ, శ్రావణ్, ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ నాగరాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

లక్సెట్టిపేట: పట్టణంలో ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండల కేంద్రంలోని పాతబస్టాండు సమీపంలో నిర్మిస్తున్న ఆసుపత్రి పక్కా భవనాన్ని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుతో కలిసి ఆదివారం పరిశీలించారు. భవనం పనులు నాణ్యతగా ఉండాలని, జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడువులోపు నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రి గదులను, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగు భూములకే 'భరోసా'

- వెంచర్లు, గుట్టలు, ముంపు భూములకు బంద్
- సాగు, భూపరిమితులపై అధికారుల సర్వే
- ఈనెల 26 నుంచి అర్హులకు పెట్టుబడి సాయం



మంచిర్యాలఅగ్రికల్చర్: సాగు భూములకే 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పంట పెట్టుబడి సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 26 నుంచి రైతు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతుబంధు దుర్వినియోగమైంది. రియల్ వెంచర్లు, ప్రాజెక్టు భూములు, గుట్టలు, రోడ్లు, నివాస భవనాలకు స్థలాలకు సైతం ఎకరానికి రూ, 5 వేల చొప్పున జమ చేసింది. తాజా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సాయాన్ని ఎకరానికి రూ.6 వేలకు పెంచి అందించనుంది. అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో పారదర్శకత ఉండేలా సాగులో ఉన్న భూమికే ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఐదు నెలలు సర్వే నిర్వహించింది. గడిచిన ఖరీఫ్ సీజన్ వర్షాకాలంలో సాగు చేసిన పంటలను ప్రామాణికంగా తీసుకొని 'ల్యాండ్ యుటిలైజేషన్ సర్వే ఫీల్డ్ వెరిఫికేషన్' పేరిట సర్వే చేశారు. ఈ సర్వే ఆధారంగానే 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించనుంది. దీనిపై రైతుల్లో కొంత గందరగోళం నెలకొంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసి యాసంగి సీజన్ ప్రారంభమైంది. వానాకాలంలో సాగు చేసిన పత్తి, వరి పంటల సాగు అధికంగా ఉంటుండగా ఈ పంటలు ఇప్పటికే చేతికి వచ్చాయి. ఏ సీజన్ సాగు ప్రమాణికంగా తీసుకొని పెట్టుబడి సాయం అందించనున్నారని రైతులు కొంత అయోమయానికి గురవుతున్నారు. జిల్లాలో 3.60 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంటుంది. 1.48 లక్షల మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం రైతుబంధు పథకం కింద 1.38 లక్షల మంది రైతులకుగాను రూ.178 కోట్ల నగదు ఖాతాలో జమ చేసింది. గడిచిన వానాకాలం సీజన్లో 3.20 లక్షల ఎకరాల్లో పంటలు సాగు ఇందులో ప్రధానంగా పత్తి, వరి పంటలు సాగయ్యాయి. ప్రస్తుతం పంట దిగుబడులు ఇప్పటికే వచ్చాయి. జిల్లాలో ఎక్కువగా వర్షాధారంగా పంటలు సాగవుతున్నాయి. యాసంగిలో సాగు విస్తీర్ణం సగానికి పడిపోతుంది గోదావరి తీర ప్రాంతంలోనే వరి సాగు విస్తీర్ణం ఉంటుంది. మిగతా ప్రాంతాల్లో యాసంగిలో సాగు చేయడం లేదు.

వర్షాధారంగానే సాగు

పంట పెట్టుబడి సాయం కొర్రీ లు పెట్టకుండా అందించాలి. గతంలో అందించిన మాదిరిగానే ఖాతాలో వేయాలి. పోయిన వానాకాలం పంట సాయం రా లేదు. ఇప్పుడు పంట వేసుకున్నోళ్లకే అంటున్నారు. వానాకాలంలో పంట వేసిన దిగుబడి వచ్చింది. ఇప్పుడు ఎండాకాలంలో పంట వేయడం లేదు. వర్షాకాలంలోనే పంట వేస్తున్న. ఎండ కాలంలో రెండు ఎకరాలు మించి వేయడం లేదు. ఇప్పుడు కోతలు పెట్టొద్దు.

– భీమరాజుల మల్లేశ్, నెన్నెల

కొర్రీలు పెట్టొదు..

ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ పథకంలో కొర్రీలు విధించింది. మాకు రుణమాఫీ జరగలేదు. కుటుంబంలో కొంత మందికి అని, రేషన్‌కార్డు, రెండు లక్షలకుపైన ఉన్న, భార్య భర్తలకు రుణం తీసుకున్నా లోను మాఫీ కాలేదు. రైతుభరోసాలో కూడా ఇలాంటి కొర్రీలు పెట్టకుండా సాయం అందించాలి.

– బొమ్మిడి శ్రీనివాస్, కుందారం, జైపూర్

రైతు భరోసా అమలు చేయాలని పోస్టర్లు



కొమ్మెర గ్రామంలో పోస్టర్లతో రైతులు

చెన్నూర్‌రూరల్: కొర్రీలు లేకుండా ప్రభుత్వం రైతు భరోసా అమలు చేయాలని మండలంలోని కొమ్మెర రైతులు శనివారం రాత్రి ఊరూరా పోస్టర్లను అంటించారు. ఎకరానికి రూ.17,500 చొప్పున రైతులకు బాకి పడ్డ నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

మందమర్రివాసికి బహుజన సాహిత్య అకాడమీ అవార్డు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి టెంపుల్ ఏరియాకు చెందిన దాసరి శ్రావణ్‌కుమార్‌కు బహుజన సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 8వ తెలంగాణ రాష్ట్ర అకాడమీ కాన్ఫరెన్స్‌లో అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లాల రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ తాను చేస్తున్న సమాజసేవను అకాడమీ గుర్తించి అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

క్లుప్తంగా

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం



గుంతలో పడ్డ కారును తీస్తున్న స్థానికులు

ముధోల్: మండలంలోని రాంటెక్ ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం కారుబోల్తా పడింది. వివరాల్లోకి వెళ్తే.. ముధోల్ మండల కేంద్రానికి చెందిన సాయి తన కారులో భైంసాకు వెళ్తుండగా సరస్వతీ నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద కారు బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో బోల్తా పడింది. అక్కడున్న స్థానికులు గమనించి కారులో నుంచి సాయిని బయటకు తీశారు. కాగా సాయికి పెద్ద ప్రమాదం తప్పింది.

పశువుల అపహరణకు యత్నం

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని గణేశ్‌నగర్‌లో కొందరు దొంగలు పశువుల అపహరణకు విఫలయత్నం చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. గణేశ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మల్లంపల్లి పోషయ్యకు చెందిన ఆవులను అపహరించేందుకు నలుగురు వ్యక్తులు శనివారం రాత్రి నంబర్ ప్లేట్ లేని ట్రాలీలో ఎక్కించారు. అనంతరం రోడ్డుపై ఉన్న మరో ఆవును ట్రాలీలో ఎక్కించే ప్రయత్నం చేయగా అక్కడే ఉన్న స్థానికుడు జెట్టి వెంకన్న చూసి కేకలు వేశాడు. దీంతో దుండగులు వెంకన్నపై దాడికి యత్నించారు. చుట్టుపక్కల వారు నిద్రనుంచి మేల్కోవడంతో దొంగలు ఆవులను అక్కడే వదిలేసి పారిపోయారు. అనంతరం స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న బ్లూకోర్ట్ పోలీసులు వివరాలు సేకరించారు. స్థానిక సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా పశువుల దొంగలపై ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు మూడు ఆటోల్లో 17.5 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా చాందా(టి) బైపాస్ వద్ద ఆదివారం పట్టుకున్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన అక్రమ్, తన్వీమ్, అర్బాజ్ ఖాన్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మూడు ఆటోలతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో ఆదివారం తెలంగాణ తెలుగు ప్రగతి ఫోరం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా దేవరాజు, రేవతి, గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, రవీందర్, కోశాధికారులుగా జాదవ్, ప్రేమ్‌సింగ్ ఎన్నికయ్యారు.

సరదా.. సరదాగా..!



పిచ్చుక

- కవ్వాల్‌లో రెండోవిడత బర్డ్‌వాక్
- కుటుంబ సభ్యులతో కలిసి పలువురు హాజరు
- పక్షులను చూసి మురిసిపోయిన పక్షిప్రేమికులు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో నిర్వహించిన రెండో విడత బర్డ్‌వాక్ సరదా సరదాగా గడిచింది. ఈ బర్డ్‌వాక్‌కు నిర్మల్, కరీంనగర్, వరంగల్ ప్రాంతాల నుంచి 15 మంది పక్షి ప్రేమికులు హాజరయ్యారు. వారికి ఇందన్‌పల్లి రేంజ్‌లోని ఘనిషెట్టి కుంట వద్ద బస ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి అధికారులు ఏర్పాటు చేసిన టెంట్‌లలో నిద్రించి, ఆదివారం ఉదయం బర్డ్‌వాక్‌లో పాల్గొన్నారు. ఈ సారి నిర్మల్‌కు చెందిన మూడు కుటుంబాలు, పిల్లలతో సహా బర్డ్‌వాక్‌లో పాల్గొనడం విశేషం. పిల్లలు చాలా సరదాగా గడిపారు. ఆసిఫాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి కుటుంబ సమేతంగా హాజరయ్యారు. బైనాక్యులర్ ద్వారా పక్షులను చూస్తూ మురిసిపోయారు. కరీంనగర్‌కు చెందిన పలువురు ఉద్యోగులు, వైద్యులు బర్డ్‌వాక్‌లో పాల్గొన్నారు. పలు రకాల ఫొటోలను కెమెరాలో బంధించారు. అనంతరం సఫారీ ద్వారా మైసమ్మ కుంట, కామన్‌పల్లి, వాచ్‌టవర్ ప్రాంతాలలో పర్యటించారు. వన్యప్రాణులను నేరుగా వీక్షించారు.



అడవిలో పక్షులను కెమెరాలో బంధిస్తున్న సందర్శకులు



బర్న్ స్వాలో పక్షి



బైనాక్యులర్‌తో పక్షులను చూస్తున్న సందర్శకురాలు



గ్రీన్ హెడెడ్ ఫిష్ఈగల్

చెన్నూర్ రేంజ్ పరిధిలో..

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ అటవీ రేంజ్ పరిధిలోని కిష్టంపేట, భీమారం మండలంలోని బూరుగుపల్లి అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో బర్డ్‌వాక్ నిర్వహించారు. శనివారం సాయంత్రం కిష్టంపేటలోని అంబేడ్కర్ ఈకో టూరిజమ్ పార్క్‌లో సందర్శకులు రిజిస్ట్రేషన్ చేసుకుని రాత్రి క్యాంప్‌ఫైర్ నిర్వహించారు. హైదరాబాద్, కరీంనగర్, ఎన్టీపీసీ, మందమర్రి ప్రాంతాల నుంచి సుమారు 21 మంది సందర్శకులు వచ్చారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు కిష్టంపేట అర్బన్ పార్కు నుంచి సఫారి వాహనాల్లో బూరుగుపల్లి సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్టుకు చేరుకొని బర్డ్‌వాచింగ్‌లో పాల్గొన్నారు. అక్కడ ఎన్నో రకాల పక్షులను గుర్తించారు. సందర్శకులు తమ కెమెరాలతో పక్షుల ఫొటోలు తీసుకున్నారు. ప్రాజెక్టు రిజర్వ్ అడవి ఉండటంతో నీటిలో ఉండే పక్షులు, వృక్షాలపైన



కిష్టంపేట సమీపంలోని అంబేద్కర్‌అర్బన్ పార్కులో సందర్శకులు, అటవీశాఖ అధికారులు

ఉండే పక్షులను సుమారుగా 120 వరకు గుర్తించారు. అక్కడి నుంచి కిష్టంపేట అర్బన్ పార్కు వద్దకు చేరుకొని అనేక రకాల పక్షులు, సీతాకోక చిలుకలు ఉన్నట్లు రిసోర్స్ పర్సన్ రాంజాన్ విరాని గుర్తించారు. మంచిర్యాల రేంజ్ అధికారి రత్నాకర్, చెన్నూర్ అటవీ రేంజ్ అధికారి శివకుమార్, డీఆర్వో ప్రభాకర్ ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు, సందర్శకులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాం



ముందుగా జన్నారం నర్సరీలో బస ఏర్పాటు చేయాలనుకున్నాం. కానీ పర్యాటకుల ఒత్తిడి మేరకు ఘనిషెట్టి కుంటలో బస ఏర్పాటు చేశాము. భోజనం, డేరాల సౌకర్యాలు కల్పించాం. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బందితో కలిసి అన్ని వసతులు ఏర్పాటు చేశాం.

– కారం శ్రీనివాస్, రేంజ్ అధికారి

కొత్త అనుభూతినిచ్చింది..



బర్డ్‌వాక్‌కు కుటుంబంతో వచ్చాం. రాత్రి అడవిలో గడపడం కొత్త అనుభూతినిచ్చింది. రాత్రి పక్షుల శబ్దాలు చాలా ఆహ్లాదాన్ని కలగజేశాయి. నా భర్త, పిల్లలతో కలిసి ఫైర్ క్యాంపులో చాలా ఎంజాయ్ చేశాను. తెల్లారి చాలా రకాల పక్షులను వీక్షించాము.

– విష్ణుతేజ, నిర్మల్

చాలా రకాల పక్షులను గుర్తించాం



ఇక్కడి వాతావరణంలో గడపడం కొత్త అనుభూతినిచ్చింది. పక్కనే నీటి కుంట, పచ్చని అడవుల మధ్య స్వచ్ఛమైన వాతావరణంలో గడపడం చాలా బాగుంది. ఉదయాన్నే పలు పక్షులను కెమెరాలో బంధించాను. బర్డ్‌వాక్ నిర్వహించడం వల్ల అందరితో స్నేహభావం ఏర్పడుతుంది.

– నర్సింహరెడ్డి, వైద్యుడు, నిర్మల్

పర్యావరణంపై అవగాహన



ఇదివరకు బర్డ్‌వాక్ కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా పర్యావరణం, ఎకోసిస్టంపై అవగాహన కలుగుతుంది. యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలి. బర్డ్‌వాక్ ద్వారా వివిధ ప్రాంతాల బర్డ్‌వాకర్ల మధ్య స్నేహబంధం పెరుగుతుంది.

– దీపక్‌రెడ్డి, కరీంనగర్

చాలా ఎంజాయ్ చేశా



బర్డ్‌వాక్‌లో నేను మా అమ్మానాన్నలతో కలిసి వచ్చాను. రాత్రి క్యాంప్‌ఫైర్, అడవిలో నిద్రించడం గొప్పగా అనిపించింది. పొద్దున అనేక రకాల పక్షులను చూశాను. బైనాక్యులర్‌లో పక్షులను గుర్తించి వాటి పేర్లను అడిగి తెలుసుకున్నాను.

– సాయి ఇక్షిత, ఐదో తరగతి విద్యార్థిని, నిర్మల్

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్

సారంగాపూర్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన బొబ్బిలి సాయికుమార్, తన స్నేహితుడు మైనర్ బాలుడితో కలిసి అదే గ్రామానికి చెందిన అర్షద్ అనే యువకుడిపై హత్యాయత్నం చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ రాజేశ్‌మీనా, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బోరిగాం గ్రామానికి చెందిన షేక్ అర్షద్, సాయికుమార్‌లు స్నేహితులు. వీరిద్దరి మధ్య డిసెంబర్ 31, 2024న స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో సాయికుమార్, మైనర్ బాలుడితో కలిసి ఈనెల 4న అర్షద్‌ను గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు రప్పించాడు. అనంతరం సాయికుమార్ వెంట తెచ్చుకున్న కత్తితో మైనర్ స్నేహితుడితో కలిసి హత్యాయత్నం చేశాడు. అర్షద్ గాయపడగా స్థానికులు గమనించి నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు సాయికుమార్‌తో పాటు మైనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కేసు వివరాలను ఏఎస్పీ రాజేశ్ మీనా, సీఐ రామకృష్ణలు పర్యవేక్షిస్తున్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా, ఎస్సై శ్రీకాంత్

సెల్ఫీ తీసుకుంటూ.. పురుగుల మందు తాగాడు..

కౌటాల: సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఓ యువకుడు పురుగుల మందు తాగిన ఘటన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగింది. కౌటాల మండలం బోదంపల్లి గ్రామానికి చెందిన కె.వెంకటేశ్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని తండ్రి గతంలోనే మరణించాడు. తల్లి సత్తక్క కూలీ పనులు చేస్తోంది. శనివారం ఇంట్లో గొడవ జరగడంతో మనస్తాపం చెందాడు. గ్రామ శివారుకు వెళ్లి.. సెల్ఫీ వీడియో తీసుకుంటూ క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన స్థానికులు తల్లికి సమాచారం అందించారు. అనంతరం కాగజ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వెంకటేశ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ఆదివారం తెలిపారు. వేరే కులం యువతిని ప్రేమించడంతోనే ఇంట్లో గొడవ జరిగినట్లు సమాచారం. ఈ విషయమై కుటుంబ సభ్యులు వెంకటేశ్‌ను మందలించారని సమాచారం. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఎవరూ ఫిర్యాదు చేయలేదని కౌటాల పోలీస్ అధికారులు తెలిపారు.



పురుగుల మందు తాగుతున్న యువకుడు

ఓపీఎస్ అమలు చేయాలి

- పేటా టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిగౌడ్

మంచిర్యాలఅర్బన్: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్(పేటా)తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిగౌడ్ తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ సమావేశం ఆదివా రం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ పెండింగ్ బిల్లులు మంజూరు కు కృషి చేస్తున్నామన్నారు. స్పోర్ట్స్ కోటాకు సంబంధించిన జీవోను సవరించి క్రీడాకారుడికి లబ్ధి చేకూరేలా ప్రయత్నిస్తున్నామన్నారు.

పేటా నూతన కమిటీ ఎన్నిక

ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ అసోసియేషన్ (పేటా తెలంగాణ) జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రేణి రాజయ్య, ప్ర ధాన కార్యదర్శి బెల్లం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షురాలిగా రోసి వరకుమారి, కోశాధికారిగా వి జయ్‌చంద్రరావును ఎన్నుకున్నట్లు పర్యవేక్షకు డు వేల్పుల సురేందర్ తెలిపారు. సమావేశంలో నల్గొండ, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చంద్ర య్య, సురేందర్, సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి డేవిడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు మీనారెడి ఉ పాధ్యక్షుడు యాకుబ్, ఉమామహేశ్వరి, లింగ య్య, జహ్నవి మంజుల పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

'కార్మికులను లెటర్లతో వేధించడం సరికాదు'

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చర్చించేందుకు ఎస్టీపీపీలో ఏర్పాటు చేసిన సమావేశానికి వచ్చిన కాంట్రాక్టు కార్మికులకు బెదిరింపు లెటర్లు ఇచ్చి వేధిస్తే ఊరుకునేది లేదని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ సంబంధిత కంపెనీ అధికారులను హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా సింగరేణి యాజమాన్యం, విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న పవర్‌మేక్ కంపెనీ అధికారుల దృష్టికి కాంట్రాక్టు కార్మిక సమస్యలను తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదన్నారు. కార్మిక సమస్యలపై సమ్మె చేయడం కోసం సన్నద్ధం అవుతున్న నేపథ్యంలో కక్ష సాధింపుగా అధికారులు కార్మికులకు లెటర్లు ఇస్తున్నారని, దీన్ని పూర్తిగా మానుకోవాలన్నారు. ఇతర పవర్ ప్లాంట్లో చెల్లిస్తున్న విధంగా ఇక్కడ కూడా కార్మికులకు అర్హతకు తగిన వేతనాలు, అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు.



రియాజ్ అహ్మద్

సింగరేణి సొత్తుకు భద్రతేది?

- చోరీ అవుతున్న ఖరీదైన స్క్రాప్, సామగ్రి
- సిబ్బంది కొరతతో ప్రైవేట్ సెక్యూరిటీ నియామకం
- దొంగలను పట్టుకోవడంలో విఫలం
- ఇటీవలే వర్క్‌షాపులో చోరీకి విఫలయత్నం
- వ్యవహారంపై విజిలెన్స్ ఆరా

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో విచ్చలవిడిగా దొంగలు స్వైర విహారం చేస్తున్నా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకోలేక పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏరియాలో అనేక దొంగతనాలు జరిగినా కనీసం ఒక్కచోటనైనా దొంగలను పట్టుకోలేదు. ఏరియాలోని విధి నిర్వహణలో భాగంగా సిబ్బంది కొరత వలన ప్రాధాన్యత ఉన్నటువంటి చోట ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను విధుల్లో ఉంచడం వలన దొంగలకు చోరీ చేయడం సులువవుతుందనే ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి.

సిబ్బంది కొరత..

మందమర్రి ఏరియా నుంచి మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, కాసిపేట ఏరియాల్లో సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహించాలి. ఏరియా వ్యాప్తంగా సుమారు 250 వరకు పోస్టులు ఉన్నాయి. దానిలో 100 మంది సింగరేణి సిబ్బంది ఉంటే సగానికి పైగా అంటే 140 వరకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులే ఉన్నారు. కాంట్రాక్టర్‌లు మారినప్పుడల్లా నిబంధనలకు విరుద్ధంగా మామూళ్లకు కక్కుర్తిపడి ఇష్టారీతిగా ప్రైవేట్ సెక్యూరిటీని నియమిస్తున్నారు. ఇప్పటికైనా సరిపడా సింగరేణి సెక్యూరిటీని నియమించి ప్రాధాన్యత గల పోస్టుల్లో ఉంచాలని, సింగరేణి ఆస్తులను కాపాడే విధంగా చూడాలని పలువురు సూచిస్తున్నారు. చోరీ జరిగిన చోట సంబంధిత కాంట్రాక్టర్ వద్ద నుంచి చోరీకి గురైన సామగ్రి విలువగల సొమ్ము వసూలు చేయాలని పలువురు పేర్కొంటున్నారు. పనికిరాని స్క్రాప్‌ను ఎప్పటికప్పుడు విక్రయిస్తే సంస్థకు కూడా ఆదాయం వస్తుందని సూచిస్తున్నారు.

విచ్చలవిడిగా దొంగతనాలు..

మందమర్రి ఏరియాలో ఆర్కే1ఏ, కేకే 1 గనులు మూసివేయడం వలన ఆ గనుల వద్ద భారీ మొత్తంలో ఖరీదైన స్క్రాప్, విలువైన సామగ్రి నిల్వ ఉంటుంది. ఆ గనులను టార్గెట్‌గా చేసుకుని దొంగలు విచ్చలవిడిగా చోరీలకు పాల్పడున్నారు. విలువైన సామగ్రిని కళ్లుమూసి తెరిచే లోపే మాయం చేస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్నటువంటి సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేసినా దాడి చేసి మరీ వచ్చిన పని కానిచ్చేస్తున్నారు. ఏరియాలోని గనుల్లో తొలగించిన సామగ్రిని ఏరియా వర్క్‌షాపులో నిల్వ ఉంచుతారు. సుమారు తొమ్మిది, పది ఫీట్ల ఎత్తున్న ప్రహరీని అవలీలగా ఎక్కి వారి పని చేసుకుంటున్నారు. ఇటీవల ఓ దొంగ వర్క్‌షాపు ప్రహరీ గోడ దూకి లోనికి వచ్చి చోరీకి ప్రయత్నించగా విధి నిర్వహణలో ఉన్న సెక్యూరిటీ టార్చ్‌లైట్ వెలుతురు చూపించడంతో అప్రమత్తమై గోడ దూకి పరారయ్యాడు. ఈ వ్యవహారంపై సెక్యూరిటీ అధికారులు ఆరా తీస్తున్నారు. పది ఫీట్ల గోడ దూకి లోనికి వచ్చిన దొంగను పట్టుకునే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకు పట్టుకోలేక పోయారనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారమంతా వర్క్‌షాపులో అమర్చిన సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డు అయినప్పటికీ ఇంతవరకు కనీసం పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంలో ఆంతర్యమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



వర్క్‌షాపులోనికి చొరబడిన దొంగ(ఫైల్)



గోడ దూకుతున్న దొంగ(ఫైల్)

రాయపూర్‌కాండ్లీలో మనుబోతులు



రాయపూర్‌కాండ్లీలో సంచరిస్తున్న మనుబోతులు

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ ప్రాంతంలోని సాయి రైస్‌మిల్ పక్కన రెండు మనుబోతులు ఆదివారం సంచరిస్తూ దర్శనమిచ్చాయి. లోకేశ్వరం, పంచగుడి మార్గం నుంచి వెళ్లే ప్రజలు మనుబోతులను తిలకించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాంసి: భీంపూర్ మండలంలోని పెన్‌గంగ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్‌లను భీంపూర్ పోలీసులు ఆదివారం సాయంత్రం పట్టుకున్నారు. పిప్పల్‌కోటి రోడ్డు వద్ద ఎస్సై కలీం సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా తాంసి(కె) నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్‌లను పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఇసుక ట్రాక్టర్‌లపై తదుపరి చర్యలపై మైనింగ్ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు. మండలంలో పెన్‌గంగ నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజారోగ్యం కోసం కేంద్ర పథకాలు

- ఎంపీ నగేశ్

జన్నారం: అన్ని వర్గాల ప్రజల ఆరోగ్యం ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెడుతోందని ఆదిలాబాద్ ఎంపీ గెడం నగేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర సినిమా హాలు ఆవరణలో రాఘవేంద్ర ట్రస్టు, మెడిలైఫ్ సంయుక్తంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించే దిశగా ప్రధాని మోదీ అడుగులు వేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.5లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించిందని పేర్కొన్నారు. పేద, గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే సంకల్పంతో మెగా వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉచిత వైద్య పరీక్షలు, మందులతో పాటుగా దూర ప్రయాణం చేసిన రోగులకు రవాణా సౌకర్యం, భోజన సౌకర్యం కల్పించిన నిర్వాహకులు మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌ను ఎంపీ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

ప్రజాసేవ కోసం పార్టీలకతీతంగా..

ప్రజలకు సేవలందించేందుకు పార్టీలకతీతంగా ముందుంటానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. రాఘవేంద్ర ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరానికి హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. నిరుపేదలకు చక్కని వైద్యం, చికిత్సలతో పాటు మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. బీజేపీ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, రాఘవేంద్ర ట్రస్టు సభ్యులు నరేశ్, సంపత్, బీఆర్ఎస్ నాయకులు మున్వర్ అలీఖాన్, గంగాధర్, ఫజల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ సిబ్బందికి బెదిరింపులు!

కాసిపేట: బెల్లంపల్లి నుంచి మండలంలోని పెద్దనపల్లి, సండ్రల్‌పహడ్ మీదుగా కాసిపేటకు నిర్మిస్తున్న రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బందిని శనివారం రాత్రి కొందరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. పెద్దనపల్లి, సండ్రల్‌పహడ్ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మిస్తున్న సిబ్బంది వద్దకు కొందరు వ్యక్తులు వెళ్లి తమకు సిమెంటు బస్తాలు, కంకర, ఇసుక కావాలని అడగ్గా ఇన్‌చార్జితో మాట్లాడుకోవాలని సిబ్బంది తెలిపారు. దీంతో సిబ్బందిని దూషిస్తూ పనులు బంద్ చేయిస్తాం.. చంపేస్తామంటూ దుర్భాషలాడారు. సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోగానే సదరు వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లుగా సమాచారం.

కాగా బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులు అధికార పార్టీకి చెందినవారు కావడంతో విషయం గోప్యంగా ఉంచుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయమై ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.